మృష్టాన్న ప్రాప్తి. ప్రజలందరికీ ఐశ్వర్యప్రాప్తి. ఈ లోపున భూస్వాములకీ, పెట్టుబడి దారులకీ స్పెక్యులేషన్ మంచిది గాదు. దశఅంతటా నాయకులకు మాత్రం విందులూ, విదేశయాత్రలూ, సన్మానాలూ. కాంగ్రెస్ గోత్రీకులకు నెహ్రూ, పంత్, దేశ్ ముఖ్ లు అనుకూలురు. దేథర్ స్తోత్రం ఉపకరిస్తుంది."—అదీ యిప్పట్లో మన యోగం.

ఇదంతా చూసి, జ్యోతిశ్శాస్త్ర పండితులు సంఘటితమై గతవారం నెల్లూరులో మహాసభ జరిపారు. దేశం అంతటా ఇంచక్కగా మళ్ళీ పంథొమ్మిదో శతాబ్దం ఉదయిస్తోంది. గుళ్ళకీ గోపురాలకీ సిమెంటు రంగులు పూయించి, రేడియోలో వేదపఠనం, పురాణ కాలక్షేపం, వినిపిస్తున్నారు. పూనాలో బ్రహ్మాండమైన వాజపేయ యజ్ఞం జరుగుతోంది. ఈ యజ్ఞం సుమారు ఐదు వేల సంవత్సరాల క్రితం జరిపేవారట. మళ్ళీ యిప్పటికి కాంగ్రెస్ శకంలో, కాంగ్రెస్ గవర్నరు అధ్వర్యాన జరుగుతున్నది. అంచేత జ్యోతిష్కులు రాష్ట్రప్రభుత్వాన్ని ఒక్కటి అభ్యర్థించారు: జ్యోతిషాన్ని యూనివర్శిటీ కోర్సులో చేర్చి, అధ్యాపకులను నియమించి విద్యార్థులకు బోధించమని. ఆంధ్రప్రభుత్వం ఆ తీర్మానాన్ని ఆమోదించి తక్షణం అమలు జరిపే చర్యలు తీసుకోవడం అవసరం. విద్యామంత్రి యీ సమస్యను సానుభూతితో పరిశీలించవలసి ఉంటుంది. ఇలాగే త్వరలోనే ఆంధ్రదేశంలోని భూతవైద్యులు కూడా సంఘటితమై, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే, సెకండరీ పాఠశాలల్లో భూతవైద్యాన్ని అదనపు సబ్జెక్టుగా ప్రవేశపెట్టవచ్చు. ఇంత అభ్యుదయాన్ని ఎలాగా సాధించాము గనక బాలికల పాఠశాలల్లో ఎన్నెమ్మకథ పాఠ్యగ్రంథంగా నిర్ణయించి, సోది చెప్పడం నిర్బంధ బోధనావిషయం చేస్తే ఉత్తమ భారతీయ సంస్కృతిని యింకా పునరుద్ధరించిన వాళ్ళం అవుతాం. అవసరమైతే రెండవ పంచవర్ష ప్రణాళికలో వీటన్నిటికీ కొంత ధనాన్ని కేటాయించడంకూడా పరిశీలించదగినది—(గోరా)

---

స్కెచ్

# ఫలంలేని సాఫల్యం

"ప్రభు"

వెన్నెట్లో కుర్చీ వేయించుకొని కూర్చుంది శకుంతల. ఎనిమిది గంటల రాత్రికే చక్కగా వొచ్చిన చల్లటికాంతి లోపలి దీపాలకన్న చాలా హాయిగా కనిపించి, "అమ్మయ్య!" అనుకుంది. చీకటిపడ్డ దగ్గరనించీ ఆ గదిలో దీపం దగ్గర కూర్చుని చదవడం; తలనొప్పి వొచ్చాక ఇట్లా ఆరుబయట కుర్చీ వేసుకొని కూర్చోటం ...సాయంత్రం నించీ అట్లానే కూర్చుంటే సుఖం ఏమిటీ! అట్లా ఉక్కిరిబిక్కిరి అయాకనే ఈ సుఖంలోని నిజమైన అందం తెలిసేది.

ఏదో పుస్తకంలో బుర్రదాచుకొని కూర్చుంటే అన్నీ జ్ఞాపకంరావు; కాని, ఇట్లా ఆకాశంక్రింద భూమిమీద కూర్చుని చంద్రుడి వేపూ, నక్షత్రాల వేపూ చూస్తోంటే ఎన్నెన్నో ఆలోచనలు.

ఈ వూరు రెండేళ్ళ క్రితం వొచ్చిన కొత్తలో అక్కడే తనూ సత్యమూ కుర్చీలు వేసుకుని కూర్చొనేవారు.అయిదున్నరనించి తొమ్మిదిదాకా ఒక్కొక్కనాడు అట్లానే కూర్చొనేవారు. లేకపోతే ఆరుకి లేచి సముద్రపు వొడ్డుదాకా వెళ్ళి అక్కడ కూర్చుని వచ్చేవారు. పౌర్ణమినాడు చంద్రోదయం అవుతోంటే సముద్రం వొడ్డున కూర్చుని చూడటం ఎంత అందంగా ఉంటుందని! సత్యమూ-తనూ!

ఎలాగ ఆ అలవాటు తప్పిపోయిందో! అలా తామిద్దరూ ఆనందంగా గడిపి ఎన్నోసంవత్సరాల అయిపోయినట్లు ఉంది. ఏదో అగాధం ఈ మధ్య వొచ్చిసినట్టు—

ఏమయింది?

శకుంతలకి అదేప్రశ్న. రోజుతరవాత రోజూ. జ్ఞాపకం తెచ్చుకుని చూస్తే ఏమీలేదు. అంతా

సాఫీగా, సామాన్యంగా సాగిపోతోంది. కాని, ఈ మధ్య కాలం వొదిలేసి పరిపోలిస్తే, అంతా భేదమే. ఆ బంగారు రోజులేమైపోయ్యాయో!

"ఆనాడు ఏదో నాటకమో సినిమావో చూడడానికి వెళ్ళేము. అక్కడ మనోరమని ఆయన పరిచయం చేశారు. కాలేజీలో స్నేహితురాలట. తామిద్దరినీ ఇంటికాహ్వానించింది, ఆయన ముఖంలో నూతనోత్సాహం తాండవించింది. ఆ మరునాటి నించీ ఒక్క సాయంత్రం మళ్ళా ఆ పాత రోజుల్లాగ లేదు."

అట్లా అనుకున్నా తీరిపోతుంది. కాని, అలాంటిదేమీ జరగలేదు ఎందుకో! అనుకున్నది శకుంతల. ఆ రోజులు తిరిగి వొస్తాయని ఆశ శకుంతలకి. అందుకనే ఈ మొక్కల్లో రెండు కుర్చీలు వేయించి కూర్చోవడం. అతను వొచ్చి అవతలి కుర్చీలో కూర్చుని తనతో ఏమేమో మాట్లాడతాడని...

ఉదయం పదినించి రాత్రి పదిదాకా. అప్పటికి తనకి నిద్రవొస్తూ ఉంటుంది. భోజనంచేసి మంచం మీద పడేసరికి ఆడుకొనే నాలుగు మాటల్లోనూ ఈ ప్రసక్తేరాదు. తనకి ఓపికా ఉండదు. ఉన్నా, ఆ క్షణం ఆ ప్రసక్తి లేవడానికి ఇష్టం ఉండదు.

గేటు చప్పుడయి అటు తిరిగింది శకుంతల.

సత్యంకాదు. ఆఫీసు కుర్రాడు. ఏవో కాగితాలు తెచ్చి పడవేసేడు.

"బాబుగారు ఎక్కడ?" అన్నది శకుంతల వాడు తిరిగి వెడుతోంటే.

"క్లబ్బులో ఉన్నారమ్మా!" అని చెప్పి, వాడు వెళ్ళిపోయాడు.

ఎందుకనో ఆ వెన్నెట్లో శకుంతలకి ఆ సమాధానం నమ్మేందుకు ఇష్టంలేకపోయింది. ఆ పాడు గోడల మధ్య గంటల్ని కాల్చేందుకు ఎవరిష్టపడతారు! సత్యంపైకి ఎంత అమాయకంగా కనిపించా, ఎవరో స్నేహితురాలిని సంపాదించి ఉండి తీరుతాడనుకున్నది శకుంతల.

ఎదురింటి సావిత్రీ, భర్తా షికారు వెళ్ళవొస్తూ గేటులోనించి తనవైపు చూసీ చూడనట్లు వెళ్ళిపోయారు. అంతకన్న వాళ్ళు చెయ్యాల్సిన పని ఏమీలేదని శకుంతలకి తెలుసునుగాని, ఆ క్షణంలో వాళ్ళ మనస్సుల్లో మెదిలే ఆలోచనలూ, ఇంటికి వెళ్ళగానే వాళ్ళు ఆడుకునే మాటలూ కూడా ఆమెకి తెలియడాన్ని ఒక్కసారి తృళ్ళిపడ్డది.

సావిత్రి తనకి ఈ ఏకాకి బ్రతుకులో దొరికిన ఒక స్నేహితురాలు. రెండు అయేసరికి వొచ్చి అయిదు కాకుండా తిరిగి వెడుతూవుంటుంది. ఆ సమయంలో సగంపైగా ఆమె తన దాంపత్యజీవితం గురించే చెప్తూ ఉంటుంది.

ఆ మధ్యాహ్నం...

"అయ్యయ్యో! ఆ పుస్తకం తెద్దామనుకొంటూనే మరిచి పొయ్యానండీ! అయినా ఆయన అన్నిటికీ వెపుకుని తింటారు. రుమాళ్ళు ఇవాళ కుట్టి ఇవ్వమని హుకుం...ఇప్పటికి రెండయాయి. వొద్దామనుకుంటూనే ఆలశ్యం అయిపోయింది." అంటూ వొచ్చింది సావిత్రి

తానేదో సమాధానం చెప్పేక, "అయినా, ఆయన మరీ విపరీతం అయిపోతున్నారు. మనిషిని ఒక్క క్షణం విడిచి ఉండలేనంటే ఎట్లాగో!" అన్నది సావిత్రి తనలోతాను లాగా.

సత్యం ఇంటిదగ్గర సాధ్యమైనంత తక్కువ కాలం ఉంటాడని తెలుసు సావిత్రికి. అయినా ఎందుకని ఇట్లా తన సంసారపు విషయాల్ని అంతగా చెప్తుందో శకుంతలకి తెలీదు. తనదగ్గర మెప్పు పొందేందుకా?.తనలో ఈర్ష్య రేకెత్తించేందుకా?

"మా మరిది చదువుకి వొస్తాడనుకున్నాము... కొంచెం సాయంగా వుంటాడని ఆశపడ్డానుకూడా. కాని ఎంచేతో మేం ఇక్కడ ఉన్నా అతన్ని బెజవాడలో పెట్టారు చదువుకి!" అని వెంటనే, "తమ్ముణ్ణి తీసుకొస్తే ఎక్కడ శ్రమపడతానో అని ఆయన భయం! అంచేత ఆయనకట్టే ఇష్టమే లేదు!" అన్నది.

ఎంత అపుకుందామన్నా సావిత్రి అట్లా మాట్లాడుతోంటే శకుంతలకి కోపం వొస్తుంది- కాని, ఆమె తనకి కోపం వస్తోందని తెలియక అలాగ మాట్లాడుతోందని గ్రహించి, తనవిషయం బయట పెట్టదు శకుంతల. ఎంత దాచుకొందామన్నా ఆమె విషయంలో ఈర్ష్య కలగక తప్పడంలేదు శకుంతలకి—సావిత్రి ఎంత అదృష్టవంతురాలు! అనుకుంటూంటే అయితే ఎంత తీయటిదైనా మోతాదు అతి అవగానే చేదెక్కుతుందనీ సావిత్రే చెప్తోంది. కాని, ఆ తీయటి విషయాల

దారిద్ర్యంతో బాధపడడంకన్న ఆ చేదుతోనే బాధపడడం మంచిదని నిర్ధారించుకుంది శకుంతల.

"అయ్యయ్యో!...అయిదు అయిపోయిందండీ! ఇంక ఇరవై నిమిషాలలో ఆయన వొచ్చేస్తారు. వొచ్చేసరికి ఇంట్లో ఎదురు వెళ్ళకపోతే ఆయన ఉండలేరు!" అంటుంది సావిత్రి వెళ్ళిపోయేటప్పుడు.

వెన్నెట్లో పడుకుని ఇవన్నీ ఆలోచించుకుంటూంటే తన వెలితి మరీ తీవ్రంగా బాధించ సాగింది శకుంతలని. తనకి తెలీకుండానే ఇట్లాగ జారిపోయి తిరిగి వెళ్ళడానికి ఏంచెయ్యాలో ఎరగక తికమక పడుతోన్న బాధ—

ఆ కుర్చీవైపు మరొకసారి చూసింది శకుంతల. రోజూ తాను అక్కడ రెండుకుర్చీలూ పడవేస్తుంది. ఏదోఒకరోజున కథల్లోలాగ సత్యం హఠాత్తుగా తన తప్పు తెలుసుకుని వొచ్చి తనని తియ్యగా క్షమాపణ కోరుతాడని ఆమె ఆశ. అప్పుడు అతడు తొందరగా రాగానే కూర్చునేందుకు కుర్చీ లేక పోతే ఎట్లా? అప్పటిదాకా ఆ కుర్చీ అక్కడ ఉండడం తనని బాధించవొచ్చుకాని ఆ రోజు...

ఆలోచనలన్నీ ఒక్కసారి ఆగిపోయి శకుంతల దృష్టి దూరంగా మేడ బాల్కనీమీద కూర్చున్న సావిత్రి భర్తమీద పడింది.

* * *

ఏదో అడివిలో మహోన్నతమైన వృక్షం మీదకి ఎట్లానో వొచ్చేసింది శకుంతల. అక్కణ్ణించి చుట్టూ ఎన్నో చదరపుమైళ్ళ దూరం కనిపిస్తోంది. ఎవరికోసమో తాను ఆశగా దిక్కులు కలియజూస్తూంది. కాని ఎవరూ ఎక్కడా కనపడరు.

ఆకులలోంచి ఏదో పిలుపు వినపడ్డది శకుంతలకి. ఆత్రంగా ఆమె దిక్కులు కలియజూసింది.

ఎవ్వరూలేరు. మళ్లాపిలుపు. "శకుంతలా" అని.

ఎంతో ఆత్రంగా దిక్కులు చూసి, ఒక్కసారి తానెక్కిన చెట్టు మొదటనే తను అన్వేషిస్తోన్న వ్యక్తిని చూసింది శకుంతల.

అంత ఎత్తునించీ ఎట్లా దిగిందో ఆమెకి తెలీదు కాని, కళ్ళు తెరిచి చూసేసరికి ఎదురుగా సత్యం నిలబడి తనని పిలుస్తున్నాడు.

చంద్రుడు బాగా ఆకాశంలోకి వొచ్చాడు. మంచు పడుతోంది. "ఎంతసేపయింది మీరువచ్చి"?" అన్నది శకుంతల.

"ఇప్పుడేలే కొంచెం త్వరగా వొచ్చాను. అట్లా మంచులో పడుకున్నావేం? చూడు. వొళ్ళెట్లా చల్లబడి పోయిందో!"

తన ఒళ్ళు ముట్టుకుని అన్నాడు సత్యం.

సగం సగం తెలివొచ్చిన శకుంతల యాంత్రికంగా అతని వెనకాల ఇంట్లోకి నడిచివెళ్ళింది. భోజనాలుచేసి తిరిగి ఇద్దరూ వాకిట్లోకి వొచ్చారు. అప్పటిదాకా శకుంతల ఏమీమాట్లాడలేదు. కాని, తిరిగి ఆ వెన్నెట్లో కూర్చున్నాక మనస్సులోఉన్న మాటని దాచుకోలేక, "ఇంతకన్న త్వరగా మీరింటికి రావడానికి వీలుపడదా?" అన్నది.

సత్యం చాలా తేలికగా. దానికేముందీ! కావాలంటే రావొచ్చు. ఆ క్లబ్బులో కూర్చుని కాలం గడిపేది బదులు ఇసాగే ఒస్తాను అన్నాడు. తన చెవులని నమ్మలేక పోయింది శకుంతల, సాయంత్రం చెయ్యాల్సిన పనులని గురించి అతను ఉపన్యసిస్తాడనుకున్న శకుంతల నీరసంగా,'నిజంగా?' అన్నది.

"అవును" అన్నాడు సత్యం గంభీరంగా.

* * *

ఉదయం సత్యం తన గదిలో కూర్చుని ఎవరితోనో మాటలాడుతున్నాడు. ప్రక్కగదిలోవున్న శకుంతలకి ఆ సంభాషణ వినపడ్డది.

"రామస్వామి చూశావుగా! ఆఫీసు గడియల్లో తప్ప ఇంట్లో కనపడడు?" అన్నాడు మిత్రుడు.

"అతనూ అంతే?" అని అడుగుతున్నాడు సత్యం.

"ఆఁ...ఆ అమ్మాయిమీద చచ్చేంత అనుమానం. ఎప్పుడూ ఆమెని కాసుకోడమే. శివరామం భార్య వెంకట్రావుతో ప్రయాణం సాగించిన ఉదంతం తెల్సిందా?

"ఆఁ నిన్న విన్నాను."

"రామస్వామికాసంగతి తెలిస్తే సెలవైనా పెడతాడు!"

సాయంత్రం అయిదున్నర అయేసరికి గేటు తోసుకుని సత్యం లోపలికి వొస్తున్నాడు. ఇవాళ బీచికి వెళ్ళాలని ఒప్పందం.

త్వరగావెళ్ళి ముసుగుతన్ని పడుకుంది శకుంతల. అతను వొచ్చి "ఏం అట్లా ఉన్నావ్?" అన్నాడు.

శకుంతల నీరసంగా "తలనొప్పి చంపేస్తోందండీ!" అని నిట్టూర్చి గోడవైపు తిరిగింది. ★